క్లుప్తంగా

వరసిద్ధుడి సేవలో రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్


ఆలయంలో ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామిని ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కోటేశ్వర చౌదరి శుక్రవారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయాధికారులు దగ్గరుండి స్వామివారి దర్శనం కల్పించారు. వేద ఆశీర్వచన మండపంలో పండితుల ఆశీర్వచనంతో పాటు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయ నిత్య అన్నదాన ట్రస్టుకు శుక్రవారం ఓ దాత నగదు విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన దాత శకుంతల రూ.లక్ష నగదును విరాళంగా ఇచ్చారు. ఆ నగదును అందుకున్న ఆలయ అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామి దర్శనం కల్పించారు. ప్రసాదం అందజేశారు.

ఆధునిక విద్యావకాశాలు


ఆటోమొబైల్ ఇంజినీరింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐఐటీ ఇంజినీర్లు

ఐరాల: గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యావకాశాలు కల్పించే దిశగా సెయింట్ స్టీఫెన్స్ పబ్లిక్ స్కూల్ ప్రోత్సహిస్తోందని ఆ పాఠశాల కరస్పాండెంట్ ఉషా కిరణ్ పేర్కొన్నారు. స్థానిక సెయింట్ స్టీఫెన్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం శుక్రవారం మద్రాస్ ఐఐటీలో ఓపెన్ హౌస్ డే సందర్భంగా ఆధునిక పరిశోధన కేంద్రాలను సందర్శించారు. ఇందులో భాగంగా రాకెట్ సైన్స్, ఓషన్ ఇంజినీరింగ్, ఏరో స్పేస్ ఇంజినీరింగ్ వంటి ప్రయోగశాలలను సందర్శించారు. విద్యార్థులకు ఐఐటీ ప్రొఫెసర్లు నూతన ఆవిష్కరణలను క్షుణ్ణంగా వివరించారు. ఐఐటీ, జాతీయ విద్య పరిశోధనా సంస్థల సహకారంతో మరింత మెరుగైన విద్యను అందిస్తామని ఆమె తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కార్వేటినగరం: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్–1938 జిల్లా అధ్యక్షుడు కిరణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల ఆవరణంలో మండల విద్యాశాఖ అధికారులు విజయకుమార్, మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏపీటీఎఫ్ నాయకులు కలసి కాలమాన పట్టికను ఆవిష్కరించారు.

ఆగని ఫోర్జరీ దందా!

రెవెన్యూలో ఫోర్జరీ దందా పాతుకుపోయింది. ఏడాది క్రితం తహసీల్దార్ సంతకం ఫోర్జరీ చేసిన ముఠా సభ్యులు కటకటాలపాలయ్యారు. ఇది మరవక ముందే మరోమారు ప్రస్తుత తహసీల్దార్ సంతకం ఫోర్జరీ బట్టబయలైంది. ఎంజాయిమెంట్ సర్టిఫికెట్ కోసం సంతకం, డమ్మీ సీల్ వినియోగించారు. రిజిస్ట్రార్ కార్యాలయ అధికారుల గుర్తింపుతో ఈ బోగస్ వెలుగుచూసింది. ఇదీ ఇంటి దొంగల పనేనంటూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పట్టుబడిన ఆ పత్రాలను ఆధారంగా చేసుకుని రెవెన్యూ అధికారులు కేసు పెట్టే యోచనలో పడ్డారు.





- చిత్తూరు అర్బన్ తహసీల్దార్ సంతకం ఫోర్జరీ
- ఎంజాయిమెంట్ సర్టిఫికెట్‌లో డమ్మీ సీలు, సంతకం
- బోగస్ సంతకాన్ని గుర్తించిన రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు
- ఇదీ ఇంటి దొంగల పనేనంటూ అనుమానాలు
- కేసు పెట్టే యోచనలో రెవెన్యూ అధికారులు

దమ్ముంటే పట్టుకోండి

నకిలీ ఇళ్ల పట్టాలు, ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టిస్తున్న ముఠా సభ్యులు దమ్ముంటే పట్టుకోండి అంటూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. కొంత మంది కార్యాలయంలో పనిచేస్తున్న ప్రైవేటు వ్యక్తులు కూడా అధికారుల సంతకాలు పెట్టడంలో ఆరితేరినట్లు అధికారుల దృష్టికి వెళ్లింది. ఈ సంతకాలకు రూ.వేలల్లో తీసుకుంటున్నారని తెలుస్తోంది. వీఆర్వో సంతకానికి రూ.10వేలు, సర్వేయర్ సంతకం, పత్రాలకు రూ.30 వేలు, ఆర్ఐ, డీటీ సంతకాలకు రూ.20వేలు, తహసీల్దార్ సంతకాలకు రూ.50 వేల నుంచి రూ.ఒక లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు అధికార వర్గాలు కోడై కూస్తున్నాయి. దీనిపై పూర్తి స్థాయిలో అధికారులు నిఘా పెట్టారు. పట్టుబడితే కేసులు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరంలో అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలున్నాయి. వీటి కింద 41 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఈ గ్రామాల నుంచి వచ్చే అమయాకపు రైతులను బురిడీ కొట్టించేందుకు కొంత మంది దళారులు తిష్ట వేశారు. కొంతమంది ముఠాగా ఏర్పడి, ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకుని ఇక్కడే కాపురం పెట్టారు. అక్కడికి సంబంధిత వ్యక్తులను పిలిపించుకుని దందా నడుపుతున్నారు. తమిళనాడులోని వేలూరు కేంద్రంగా చేసుకుని దొంగ సీళ్లు తయారు చేయించుకుంటున్నారు. రెవెన్యూ అధికారుల సంతకాలను పదేపదే ప్రాక్టీసు చేసి ఫోర్జరీ చేస్తున్నారు.

పాగా వేసి..

ప్రస్తుతం చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో భూ సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇందులో సెటిల్‌మెంట్లు, డీకేటీలు కూడా ఉన్నాయి. భాగపరిష్కారాలు, డీకేటీలపై పూర్తి స్థాయిలో హక్కులు పొందేందుకు చాలా మంది కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటారు. మరి కొందరు గ్రామకంఠం భూములు, ఇతరత్రా భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అడ్డదారులు వెతుకుతుంటారు. వీరందరినీ ఆసరాగా చేసుకుని దళారులు ప్రధానంగా దొంగ పట్టాలు, తప్పుడు పత్రాలు, దొంగ సంతకాల సృష్టికర్తలుగా మారారు. వీరంతా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద కూడా కాసుక్కుని కూర్చున్నారు.

డీకేటీ మాయాజాలం

ఇంటిపై, భూములపై బ్యాంకు రుణాలు తీసుకునేందుకు అధికమంది ఆసక్తి చూపుతున్నారు. ఈ సమయంలో సెటిల్‌మెంట్ భూములకు రిజిస్ట్రేషన్లు త్వరితగతిన పూర్తవుతున్నాయి. రికార్డులు సక్రమంగా ఉంటే రెవెన్యూ అధికారులు పత్రాలు ఇచ్చేస్తున్నారు. అయితే డీకేటీ భూములు, ఇళ్లు ఉన్న వ్యక్తులు కూడా బ్యాంకు రుణాల కోసం ఎగబడుతున్నారు. ఇదే అదునుగా భావించి రెవెన్యూ, రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ఉన్న దళారులు తప్పుడు పత్రాలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారు. అంతా తామై కార్యాలయాలను శాసిస్తున్నారు. డీకేటీ భూములకు పక్క ఉన్న సెటిల్‌మెంట్ భూముల సర్వే నంబర్లను చూపించి డీకేటీ భూములను రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇందుకు రూ.50 వేల నుంచి రూ.ఒక లక్ష వరకు తీసుకుంటున్నారు. ఇలా తీసుకున్న పత్రాలతో రూ.5 లక్షలకు పైగా బ్యాంకు రుణాలు తీసుకుంటున్నారు. ఇదీ చిత్తూరులో ఇప్పుడు పెద్ద వ్యాపారంగా మారింది. దళారులకు కూడా మంచి కాసుల వర్షం కురిపిస్తోంది. పత్రాలు సృష్టి నుంచి బ్యాంకు రుణాలు తీసి ఇచ్చేంత వరకు వీరే బాధ్యతలు తీసుకుంటున్నారు. ఇలా ఇప్పటి వరకు కొన్ని వందల తప్పుడు పత్రాలు తయారై.. కోట్లాది రూపాయల రుణాలు బ్యాంకుల నుంచి పొందినట్లు అధికారుల అంచనా వేశారు.


తహసీల్దార్ ఫోర్జరీ సంతకంతో బయటపడ్డ పత్రం

వదిలిపెట్టే ప్రసక్తే లేదు



ఎంజాయిమెంట్ సర్టిఫికెట్ కోసం రిజిస్ట్రార్ ఓ పత్రం వెళ్లింది. ఆ పత్రంలో నా సంతకం ఫోర్జరీ చేశారు. అసలు అది నా సంతకమే కాదు. ఇది చేసిన వాళ్లు ఎవరైనా పట్టుకుంటాం. వారిపై కేసులు పెడతాం. వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ప్రజలు కూడా దళారులను నమ్మొద్దు. ఇలాంటి వ్యక్తుల వద్దకు వెళ్లి మోసపోవద్దు. అలాంటి వ్యక్తులు కనిపిస్తే కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

–కళావతి, తహసీల్దార్, చిత్తూరు అర్బన్

ఇదిగో సాక్ష్యాలు..

- చిత్తూరు మండలానికి సంబంధించి ఓ గ్రామకంఠ భూమిని ఇటీవల రిజిస్ట్రేషన్ చేసేశారు. ఇందుకు ఓ వీఆర్వో కూడా సంతకాలు చేశారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో పంచాయతీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఆ తర్వాత అధికారులను విచారించారు. రిజిస్ట్రేషన్ చేసిన అతనికి, వీఆర్వోకు గట్టిగా వార్నింగ్ ఇచ్చి.. ఆ రిజిస్టర్ పత్రాన్ని చించివేశారు.
- ఏడాది క్రితం చిత్తూరు నగరానికి చెందిన ఓ మహిళ డీకేటీ పట్టాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చింది. కొన్ని పత్రాలు కావాలని అక్కడి అధికారులకు విన్నవించింది. ఇదీ డీకేటీ భూమి అని..రిజిస్ట్రార్ చేసుకోవడానికి ఎలాంటి పత్రాలు ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పారు. దీంతో ఆమె దళారుల మాయలో పడింది. ఆ దళారులు తప్పుడు పత్రాలు, సంతకాలు, సీళ్లు వేసి రిజిస్ట్రార్‌కు పంపారు. ఇది గమనించిన రిజిస్ట్రార్ తహసీల్దార్ సంతకంపై అనుమానం రావడంతో విచారణ మొదలుపెట్టారు. దీంతో అసలు విషయం బయటపడింది. అప్పటి తహసీల్దార్ కిరణ్ ఫోర్జరీ సంతకాలు చేసిన వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ సీలు వేలూరులో తయారు చేసినట్లు గుర్తించారు.
- తాజాగా ఇదే మాదిరిగానే ప్రస్తుత తహసీల్దార్ సంతకాలతో అనుభవ పత్రం కోసం రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లిన పత్రం ఒకటి వెలుగులోకి వచ్చింది. రిజిస్ట్రార్‌కు అనుమానం రావడంతో ఆ అనుభవ పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయానికి పంపారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ ప్రారంభించారు. వీటితో పాటు పలు ఇళ్ల పట్టాలు ఫోర్జరీ సంతకాలతో వెలుగుచూస్తున్నాయి.

చిత్తూరు బార్ అధ్యక్షుడిగా శంకర్ నాయుడు



గెలుపొందిన బార్ నూతన కార్యవర్గం

చిత్తూరు అర్బన్: చిత్తూరు న్యాయవాదుల సంఘం (బార్) అధ్యక్షుడిగా కె.శంకర్ నాయుడు ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి వసంత కుమార్ ప్రకటించారు. శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కె.శంకర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శిగా సి.సురేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జి.భూప్రసన్న, సంయుక్త కార్యదర్శిగా జీఎం.షఫీవుల్లా, కోశాధికారిగా ఎస్.ఆనందన్, లైబ్రరీ కార్యదర్శిగా ఎం.రవిచంద్రన్, సాంస్కృతి కార్యదర్శిగా కెఎం.రాజాచంద్ర యాదవ్, క్రీడల కార్యదర్శిగా సి.సుబ్రమణ్యం గెలుపొందారు. కాగా కార్యనిర్వాహక సభ్యులుగా సీనియర్ విభాగంలో చిన్నబ్బ, విజె.శరవణ, జూనియర్ విభాగంలో అక్బర్‌బాషా సయ్యద్, కె.తులసీరామ్, టి.రవికుమార్ ఏకగ్రీవమైన విషయం తెలిసిందే. కాగా నూతన కార్యవర్గం రెండేళ్లపాటు పదవిలో కొనసాగుతుంది.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

బంగారుపాళెం: పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని ఎస్టీఓ హరిప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, బంగారుపాళెం సబ్‌ట్రెజరీ కార్యాలయం పరిధిలోని ప్రభుత్వ పింఛనుదారులు తమ లైఫ్ సర్టిఫికెట్లను సకాలంలో అందజేయాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరులోపు తమ లైఫ్ సర్టిఫికెట్లను కార్యాలయంలో అందజేయాలని ఎస్టీఓ కోరారు. లైఫ్ సర్టిఫికెట్‌ను తీసుకునేందుకు ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్(ఓటీపీ కోసం), పీపీఓ నంబర్, బ్యాంక్ ఖాతా నంబరు తీసుకుని ట్రెజరీకిగానీ, మీ–సేవ కేంద్రం, ఇంటర్నెట్‌సెంటర్, పింఛనుదారుల సంఘంలో వివరాలను అందజేసి లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సర్టిఫికెట్‌ను సబ్ ట్రెజరీలో ఫిబ్రవరి 28వ తేదీ లోపు అందజేయాలని కోరారు.

వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ


వైఎస్‌ఆర్‌టీఏ డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా వైఎస్ఆర్‌టీఏ (వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్) నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించినట్లు ఆ సంఘం రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా తమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం డైరీని ముద్రించడం ఆనవాయితీ అని అన్నారు. ఉపాధ్యాయులకు ఉపయోగపడే విధంగా డైరీలోని పలు విషయాలను ముద్రించారని మాజీ మంత్రి అభినందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యువరాజరెడ్డి, ప్రధాన కార్యదర్శి జయకాంత్, సభ్యులు బాబు పాల్గొన్నారు.

మహిళా చైతన్య దీప్తి సావిత్రి బాయి


చిత్తూరు: పూలేకు నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు


బంగారుపాళెం: మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిత్తూరు కలెక్టరేట్: మహిళా చైతన్య దీప్తి సావిత్రబాయి పూలే అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ అన్నారు. శుక్రవారం నగరంలోని రైల్వేస్టేషన్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం పూలే చేసిన కృషి మరువలేనిదన్నారు. 1848లో పూణేలో ఏర్పాటు చేసిన బాలికల పాఠశాలలో ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. మహిళలను చైతన్యపరచి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి పూలే అని కొనియాడారు. అనంతరం పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సోమశేఖర్ నాయుడు,జిల్లా సహాధ్యక్షురాలు రెహానా బేగం, సహాధ్యక్షులు కె.రెడ్డప్ప నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.పి.బాషా, జిల్లా కార్యదర్శులు ఎం.పార్థసారథి, కె.సరిత, ఎం వి రమణ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి

మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్ అన్నారు. నగరంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ మహిళలు విద్య అభ్యసించడం నేరంగా భావించే ఆ రోజుల్లో పూలే స్వయంగా ఒక బాలికల పాఠశాలను ప్రారంభించడం గొప్పవిషయమన్నారు. ఆమెను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని విద్యలో రాణించాలని చెప్పారు. మహిళా సాధికారత విభాగం కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ జి ఉషారాణి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే కేవలం విద్య కోసమే కాకుండా సమాజ సేవకు ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సంధ్యారాణి, కౌసర్ జహా బేగం, రమాదేవి, వైష్ణవి, శివరాగిణి పాల్గొన్నారు.

పీవీకేఎన్‌లో....

నగరంలోని పీవీకేఎన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సేవలు భారతదేశంలో మహిళల విద్యా ఉద్యమానికి పునాది వేశాయన్నారు. మహిళల హక్కుల కోసం పోరాటం చేసి సామాజిక సమానత్వాన్ని సాధించేందుకు కృషి చేశారన్నారు. అతిథులుగా విచ్చేసిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వరలక్ష్మి, రాజ్‌కుమార్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి పూలే చేసిన సేవలు ఈనాటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె చూపించిన మార్గం ప్రతి విద్యార్థికి ఆచరణీయంగా ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సి.మీరాసాహెబ్ మాట్లాడుతూ, ‹సావిత్రీబాయి పూలే తన జీవితాన్ని మహిళా విద్యా పురోగతికి అంకితమిచ్చి, మహిళలను సమాజంలో ముందుకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ప్రతి విద్యార్థి ఆమె స్ఫూర్తితో ముందుకుసాగాల్సి అని వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రెడ్డిబాషా, ఉమాదేవి, చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి

చిత్తూరు కార్పొరేషన్: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమెకు బీజేపీ నేతలు నివాళి అర్పించారు. ఆ పార్టీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. మహిళల అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి అని జిల్లా నాయకులు శ్రీనివాసులు తెలిపారు. ఆడపిల్లలు చదువుకోని ఉన్నత స్థాయికి రావాలని సావిత్రి ఆకాంక్షించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంభా దొరబాబు గౌడ్, శ్రీనివాసన్, శ్రీనివాసులు, ఏలుమలై, గుణశేఖర్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

బంగారుపాళెం: బాలికా విద్యకు పునాదులు వేసిన గొప్ప దార్శనికురాలు శ్రీమతి సావిత్రీ బాయి పూలే అని ఎగువరాగిమానుపెంట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సూజాత అన్నారు. సావిత్రీ బాయిపూలే జయంతి (జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం)ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ, సావిత్రి బాయిపూలే భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలని గుర్తు చేశారు. మహాత్మా జ్యోతీరావు పూలే భార్య అయిన సావిత్రీబాయిపూలేను చదివించి ఉపాధ్యాయ వృత్తిలో చేర్పించారని వివరించారు. మహిళలను విద్యావంతులు చేయడంలో సావిత్రీ బాయిపూలే చేసిన కృషిని కొనియాడారు. తన భర్త జ్యోతీరావు పూలేతో కలసి బడుగు బలహీన వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా అగ్రవర్ణాలపై పోరాటం సాగించారన్నారు. 19వ శతాబ్దంలో అప్పటి పురుషాధిక్య సమాజంలో బాలికా విద్యతోనే సమాజాభివృద్ధి అని ఎలుగెత్తి చాటిన మహనీయురాలు సావిత్రి బాయిపూలే అని పేర్కొన్నారు. ఆమె జీవితాన్ని బాలికలు ఆదర్శంగా తీసుకుని విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.




చిత్తూరు: సావిత్రమ్మ కళాశాలలో బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ మనోహర్, సావిత్రి బాయి పూలేకు నివాళి అర్పిస్తున్న నాయకులు


పీవీకేఎన్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జీవనజ్యోతి

దేవాలయాలను రాజకీయ కేంద్రాలుగా మార్చొద్దు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో దేవాలయాలను రాజకీయ కేంద్రాలుగా మార్చేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు విమర్శించారు. ఆయన శుక్రవారం చిత్తూరులోని సీపీఎం కార్యాలయంలో మాట్లాడారు. ఆలయాలను రాజకీయ ప్రచార కార్యక్రమాలుగా మారుస్తూ ప్రజల మధ్య చీలికలు తెచ్చే విధంగా వ్యవహారం నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయాలపై ప్రభుత్వ పెత్తనం వద్దు అంటూ ఛలో విజయవాడ కార్యక్రమానికి సంఘపరివార్ పిలుపునిచ్చిందన్నారు. పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆధీనంలోనే దేవాలయాల నిర్వహణ ఉంటేనే బాధ్యత ఉంటుందన్నారు. రాజకీయ లబ్ధి కోసమే ఇటువంటి చేష్టలు చేస్తున్నారన్నారు. దేవాలయాలపై ప్రభుత్వం నియంత్రణ లేకపోతే పురోహితుల, ఉద్యోగులకు అన్యాయం జరుగుతుందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సురేంద్రన్, బాలసుబ్రమణ్యం, జ్యోతి, దాసు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఐరాల విద్యార్థి



పోటీలకు ఎంపికైన విద్యార్థితో హెచ్‌ఎం, పీడీ

ఐరాల: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపికైనట్లు శుక్రవారం హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ గత నెల 28 నుంచి 29వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–17 ఫెన్సింగ్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి రోహిత్ ఫెన్సింగ్ టీమ్ ఈవెంట్ సాబర్ విభాగంలో విశేష ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ విద్యార్థి జనవరిలో ఉత్తరాఖండ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో క్రీడాకారుడిని, పీడీ దేవాను, ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రాఘవ కార్తీక్‌ను ఎస్ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.